క్లుప్తంగా

నివాళి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీరాములు(45) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి గ్రామానికి చేరుకుని శ్రీరాములు మృతదేహంపై పూలమాల వేసి, నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

స్కూల్ ప్రారంభం రోజే విద్యాకానుక పంపిణీ



ఎంఈఓ కార్యాలయానికి చేరిన విద్యాకానుకలు

మద్దికెర: పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యాకానుక కిట్లను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి రంగస్వామి తెలిపారు. సోమవారం ఆయన మండలానికి చేరిన విద్యాకానుకల కిట్లను పరిశీలించారు. 26 పాఠశాలల్లోని 3,025 మంది విద్యార్థులకు గానూ 16,375 పాఠ్యపుస్తకాలు, 20,110 నోట్ బుక్స్, 20,110 బ్యాగ్స్ వచ్చాయన్నారు. స్కూళ్లు ప్రారంభమయ్యేలోపు ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేస్తామన్నారు.

అదుపు తప్పితే ప్రమాదమే..



రహదారికి ఇరువైపులా వేసిన బండరాళ్లు

కృష్ణగిరి: ఈ రహదారిలో ప్రయాణం అదుపు తప్పితే ప్రమాదమే అన్న చందనంగా మారింది. మండల పరిధిలోని ఎరుకలచెర్వు నుంచి ఆగవేళి, ఆగవేళి నుంచి సంగాల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులకు ఇరువైపులా మృత్యు రాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. పొలాల్లో ఉన్న పెద్ద బండరాళ్లను తొలగించి రహదారికి ఆనుకుని ఇలా వేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోనే వైద్యపరీక్షలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని వైద్యపరీక్షలన్నీ న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోనే నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం క్యాజువాలిటీ వద్ద రెండవ నెంబర్‌లో ఉన్న ఈసీజీ పరికరాన్ని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోకి తరలించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యపరీక్షలన్నీ ఒకేచోట ఉండటం వల్ల రోగులు అటూఇటూ తిరిగే ప్రయాస తగ్గుతుందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యాన్ని చూపుతున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సోమవారం సాయంత్రం సెబ్ కార్యాలయ సెబ్ సీఐ భార్గవరెడ్డి వెల్లడించారు. మద్యం కలిగి ఉన్నారని వచ్చిన సమాచారంతో సెబ్ ఎస్ఐ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు లింగప్రసాద్, గోపాల్, కానిస్టేబుళ్లు శ్రీనివాసగౌడ్, భరత్, నరసింహారెడ్డి, రాధమ్మ, ఇందుమతి సోదాలు నిర్వహించారు. ఇంద్రానగర్‌కు చెందిన బోయ తిక్కస్వామి, జయరాం, ఆదర్శ విద్యాపీఠం వద్ద నివాసముంటున్న బోయ గోపాల్‌ను అదుపులోకి తీసుకుని సోదాలు చేయగా 576 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

అసిస్టెంట్ లైన్‌మెన్‌పై వేటు

ఆలూరు: అవినీతి అక్రమాలకు పాల్పడిన విద్యుత్ అసిస్టెంట్ లైన్‌మెన్ వెంకటరమణపై వేటు పడింది. డబ్బు తీసుకుని అక్రమ కనెక్షన్లు ఇచ్చారనే ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఎస్ఈ ఉమాపతి ఆదేశాలతో అధికారులు విచారించి నివేదిక ఇవ్వడంతో గత నెల 18న ఏడీఈ నాగేంద్రప్రసాద్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఇదే విషయంలో అసిస్టెంట్ లైన్‌మెన్ వెంకటరమణ పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తేలింది. దీంతో వెంకటరమణను సస్పెండ్ చేస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని ఆలూరు సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ ఏడీఈ పురుషోత్తం సోమవారం తెలిపారు.

సాధనతో క్రీడల్లో రాణింపు

కర్నూలు (టౌన్): క్రీడల్లో రాణించాలంటే ప్రతిరోజు సాధన చేయాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో సమ్మర్ హ్యాండ్‌బాల్ కోచింగ్ క్యాంపు క్రీడాకారులకు దాతలు శ్రీధర్ రెడ్డి, దాశెట్టి శ్రీనివాసులు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

నేటితో ఉత్కంఠకు తెర

- 14 టేబుళ్లు.. 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు
- ఆలూరు నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు



ఆలూరు నియోజకవర్గ ముఖచిత్రం

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికలు చివరి అంకానికి చేరుకున్నాయి. మంగళవారం అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. మే 13న పోలింగ్ నిర్వహించారు. 20 రోజుల ఉత్కంఠకు నేటితో తెరపడనుంది. ఆలూరు నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు కావడంతో అభ్యర్థులు ఒక అంచనాకు రాలేకపోతున్నారు. పథకాల ప్రభావంతో సైలెంట్ ఓటింగ్ జరిగిందనే భావన అధిక శాతం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఆలూరు నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 2,58,997 మంది ఓటర్లు ఉండగా.. 2,09,080 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 80.72 నమోదు అయ్యింది.

ఇద్దరి మధ్యే పోటీ

నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా.. ఆలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి, టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ మధ్యనే పోటీ ఉంది. దీంతో ఈ రెండు పార్టీల నాయకులు ఎంతో ఉత్కంఠగా ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారు. మిగిలిన పార్టీ నాయకులతో పాటు ప్రజలు కూడా ఆసక్తిగా ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈసారి కూడా ఆలూరులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని గుసగుసలు వినిపిస్తున్నాయి.

21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో మంగళవారం కౌటింగ్ నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని 6 మండలాల్లో 294 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందుకోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేసి, 21 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. ప్రతి రౌండ్‌కు 14 పోలింగ్ కేంద్రాల ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. మొదటి రౌండ్‌లో పోలింగ్ కేంద్రం నంబర్ 1 నుంచి 14వ పోలింగ్ కేంద్రం ఈవీఎంలు లెక్కింపు ప్రారంభమై 21వ రౌండులో 281 నుంచి 294వ పోలింగ్ కేంద్రం ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపుతో కౌటింగ్ ముగియనుంది.

నియోజకవర్గంలో పోలింగ్ సరళి

పోలింగ్ శాతం	:	80.72
నియోజకవర్గంలో మొత్తం ఓట్లు	:	2,58,997
పోలైన మొత్తం ఓట్లు	:	2,09,080
పోలైన పురుషుల ఓట్లు	:	1,07,098
పోలైన మహిళల ఓట్లు	:	1,01,960
పోలైన ఇతరుల ఓట్లు	:	22
హోం ఓటింగ్ ద్వారా వచ్చిన ఓట్లు	:	214
పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	:	1,056
సోమవారం సాయంత్రం 5 గంటల వరకు వచ్చిన సర్వీస్ ఓట్లు	:	127

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

పత్తికొండ రూరల్/తుగ్గలి: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల జాతకం మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. విజేతలు ఎవరు..పరాజితులు ఎవరనే టెన్షన్ అభ్యర్థులను వెంటాడుతోంది. గత నెల మే 13న పోలింగ్ పూర్తి కాగా మంగళవారం కర్నూలులో ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇన్ని రోజుల ఉత్కంఠకు మరికొద్ది గంటల్లో తెరపడనుంది. బూత్‌ల వారీగా విశ్లేషణలు చేసుకుని ఎవరికి వారు గెలుపుపై ధీమాగా ఉన్నా.. మరోవైపు లోలోన ఆందోళన కూడా ఉంది. పత్తికొండ ఎమ్మెల్యేగా విజయం ఎవరిని వరిస్తుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి.. టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబుపై 45 వేల ఓట్ల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. ఈసారి కూడా వీరిద్దరి మధ్యే పోటీ నెలకొంది. మరోసారి గెలిచి అసెంబ్లీలో అడుగు పెడితే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి వరుసగా రెండుసార్లు మహిళా ఎమ్మెల్యేగా ఎన్నికైన రికార్డు ఆమె సొంతమవుతుంది. ఈసారైనా అరంగేట్రం చేయాలని టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు ఉన్నారు.

నియోజకవర్గంలో ఓటర్లు..

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కృష్ణగిరి	18594	18181	00	36,775
తుగ్గలి	24811	24499	06	49,316
మద్దికెర	14,559	15030	03	29,592
వెల్దుర్తి	25,584	25,368	04	50,956
పత్తికొండ	28,055	28,900	09	56,964

పోలైన ఓట్లు..

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	శాతం
కృష్ణగిరి	16,646	15,761	00	32,407	88.12
తుగ్గలి	21,666	21,007	03	42,676	86.54
మద్దికెర	12,599	12,299	02	24,900	84.14
వెల్దుర్తి	21,720	21,138	03	42,861	84.11
పత్తికొండ	23,699	23,463	03	47,165	82.80

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకుంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. కొందరు భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు ఆలయం ఆవరణలోనే పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

వజ్రాన్వేషకుల తాకిడితో రైతుల ఇక్కట్లు

తుగ్గలి: కురుస్తున్న వర్షాలకు వజ్రాన్వేషణకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న జనంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వజ్రాలు వెతికేందుకు పొలాల్లోకి దిగి తొక్కుతుండడంతో పొలం గిడసబారిపోతోందని రైతులు వాపోతున్నారు. ఇలా అయితే విత్తనం ఎలా వేసుకోవాలని, ఎంతసేపని పొలాల వద్ద కాపలా ఉండాలని ప్రశ్నిస్తున్నారు. వజ్రాన్వేషకుల తాకిడి తట్టుకోలేక రైతులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు వజ్రాన్వేషకులను పొలాల్లోకి వెళ్లకుండా తరముతున్నారు. అయినా కొత్త జనం వస్తూనే ఉన్నారు. విత్తు సమయం కావడంతో వజ్రాలు వెతికేందుకు ఎవరూ ఈ ప్రాంతానికి రావద్దని రైతులు మొరపెట్టుకుంటున్నారు.



హోలహర్వి-నిట్రవట్టి రోడ్డులో ప్రవహిస్తున్న వాగు

వర్షం..రైతన్నల హర్షం

- విత్తులో అన్నదాత నిమగ్నం



పెద్దహోతూరు-చిన్నహోతూరు గ్రామాల మధ్య పొంగి ప్రవహిస్తున్న వాగు



వర్షపు నీటితో చిత్తడిగా మారిన ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణ

ఆలూరు రూరల్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆదివారం రాత్రి ఆలూరు నియోజకవర్గంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వర్షం రాకతో ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమవుతున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులగా భానుడు ఉగ్రరూపం దాల్చడంతో వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాత్రి కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. మరోవైపు సోమవారం ఉదయమే పలువురు రైతులు విత్తనం వేసే పనుల్లో బిజీ అయ్యారు.

➡ ఆలూరు మండలంలో 47.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణంలో వర్షపు నీరు నిలిచి చిత్తడిగా మారింది. ఫలితంగా ఆస్పత్రికి వచ్చే రోగులు, గర్భిణులు, వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

హోలహర్వి: మండలంలో 64.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు గ్రామాల పరిధిలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. చింతకుంట గ్రామ శివారులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వంతెనపై నుంచి నీరు ప్రవహించి కోతకు గురైంది. దీంతో ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువన భారీ వర్షాలు కురవడంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. హోలహర్వి నుంచి నిట్రవట్టి, విరుపాపురం, కుర్లేహళ్లి, బల్లోట, బిలేహాల్ గ్రామాలకు వెళ్లే దారిలో వాగు ఎక్కి నీరు ప్రవహించింది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి విత్తే పనులకు రైతులు ఉపక్రమించారు.

చిప్పగిరి: మండలంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి వంకలు పొంగిపొర్లాయి. పొల్లాల్లో నీరు చేరాయి. పొలాలు అదును కావడంతో రైతులు పత్తి, వేరుశనగ, కంది, కొర్ర, సజ్జ తదితర పంటలు వేసే పనులు ప్రారంభించారు.

హొళగుంద: ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి గ్రామం వద్ద ప్రవహిస్తున్న వేదావతి (హగరి) నదిలో సోమవారం ఉదయం నుంచి వరద ప్రవాహం పెరుగుతుంది. వారం రోజులుగా నదిలో నీటి చేరిక ఆశాజనకంగా ఉంది. ఇన్నాళ్లు వర్షాలు లేక కళావిహీనంగా ఉన్న నదికి వరద నీరు వచ్చి చేరుతుండడంతో సమీప గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చిప్పగిరి మండలం కుందనగుర్తి వద్ద పారుతున్న వంక



చిప్పగిరి సమీప పొలాల్లో నిలిచిన వర్షపునీరు

మోస్తరు వర్షం..పైరుకు జీవం

తుగ్గలి: మండలంలో ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. 44.06 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. పలుచోట్ల చిన్నచిన్న కుంటలు నీటితో నిండి పోయాయి. వర్షం రాకతో ఇప్పటికే అక్కడక్కడా వేసిన విత్తనాలు మొలకెత్తడంతో పాటు, విత్తనం వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. విత్తుకు అవసరమైన పదునైందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

మద్దికెరలో 27.6 మిల్లీమీటర్లు

మద్దికెర: మండలంలో సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షం 27.6 వర్షపాతం నమోదైనట్లు రెవిన్యూ అధికారులు తెలిపారు. గ్రామాలలో గత రెండు రోజులు వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం చల్లబడుతుండడంతో ఎండల నుంచి ప్రజలకు కొంత మేర ఉపశమనం లభించింది. అంతేగాక రైతులు పొలాలలను దుక్కిదున్ని ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసుకోడానికి సిద్ధం చేసుకుంటున్నారు.

వెల్దుర్తిలో 23.4 మిల్లీమీటర్లు

కృష్ణగిరి: వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల వ్యాప్తంగా సోమవారం తెల్లవారుజామున వర్షం కురిసింది. వెల్దుర్తి మండలంలో 23.4, కృష్ణగిరిలో 13.8 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్లు అధికారులు తెలిపారు. ఈయేడాది మే ప్రారంభం నుంచి వర్షాలు రావడంతో ముందస్తుగా సాగు చేసిన వేరుశనగ పైరుకు ఈ వర్షం జీవం పోషింది. మిగతా రైతులు కూడా విత్తనం వేసే పనులకు ఉపక్రమించారు.



బాపనదొడ్డి సమీపంలో కళకళలాడుతున్న వేరుశనగ పైరు



మద్దికెర సమీపంలో పొలాన్ని సిద్ధం చేసుకుంటున్న రైతు

విజయోత్సవాలు నిషేధం

- పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



పులికొండలో గ్రామస్తులతో మాట్లాడుతున్న పత్తికొండ సీఐ మురళీమోహన్

పత్తికొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాలు, ర్యాలీలు, సంబరాలపై నిషేధం ఉందని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఏపార్టీ గెలిచినా ప్రజలు సంయమనంతో ఉండాలన్నారు. గొడవలు, ఘర్షణలకు పాల్పడవద్దన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదన్నారు.

- పత్తికొండ సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో ఎస్ఐలు గోపాల్, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. మంగళవారం ఓట్ల లెక్కింపు సందర్భంగా 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని, ప్రధాన రోడ్డులోని దుకాణాలు మూసివేయాలని యజమానులకు నోటీసులు జారీ అందజేశారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి అల్లర్లకు దూరంగా ఉండాలని సూచించారు. బాణాసంచా పేల్చరాదని, ర్యాలీలు, సంబరాలు చేసుకోరాదని పత్తికొండలో మైక్ ద్వారా ప్రచారం చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. వాహనాలకు తప్ప సీసాలకు పెట్రోలు, డీజిల్ వేయవద్దని పెట్రోల్ బంక్ యజమానులకు సూచించారు.

➡ కృష్ణగిరి: ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా అన్ని పార్టీల నాయకులు సంయమనం పాటించాలని వెల్దుర్తి సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి కోరారు. సోమవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ కార్యకర్తలు, అనుచరులు కవ్వింపు చర్యలు, గొడవలకు పాల్పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా పార్టీల నాయకులదేనన్నారు. ఫలితాల అనంతరం బాణాసంచా పేలుళ్లు, ర్యాలీలకు అనుమతులు లేవన్నారు.

➡ మద్దికెర: ఎన్నికల ఫలితాల సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ రమేష్‌బాబు అన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా మంగళవారం హోటళ్లు, అంగళ్లు మూసి వేసి సహకరించాలని యజమానులను కోరారు. గ్రామాల్లో కూడా గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

➡ ఆస్పరి: ఎన్నికల ఫలతాల అనంతరం అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హనుమంతప్ప హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే రౌడ్ షీట్ ఓపెన్ చేస్తామన్నారు. అల్లర్లకు పాల్పడి జైల్ పాలు కావద్దని సూచించారు. అనంతరం పోలీసులు పలు గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు అతిక్రమించరాదని ఆటోలో మైకుల ద్వారా ప్రచారం చేశారు.



ఆస్పరిలో మైకు ద్వారా ఎన్నికల నిబంధనలను ప్రచారం చేస్తున్న పోలీసులు

➡ చిప్పగిరి: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరూ ఎలాంటి గొడవలకు పాల్పడ వద్దని ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ ప్రజలకు సూచించారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. ఫలితాల అనంతరం బాణా సంచా పేల్చరాదని, సంబరాలు చేసుకోరాదని, గుమిగూడి ఉండవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కటకటాలకు పంపుతామని హెచ్చరించారు.

పండ్లతోటల పెంపకం లాభదాయకం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

పత్తికొండ రూరల్: పండ్లతోటల పెంపకం రైతులకు లాభదాయకమని ఎంపీడీఓ రామారావు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగిన రైతులు ఎవరైనా పండ్లతోటలు పెంచుకోవడానికి అర్హులన్నారు. జామ, సపోట, నిమ్మ, నారింజ, దానిమ్మ వంటి 15 రకాల పండ్లతోటలతో పాటు గులాబీ, మల్లెపూలతోటలు, మునగ వంటి ఆదాయాన్నిచ్చే పంట రకాలను 100 శాతం రాయితీతో అందిస్తున్నామన్నారు. పంట రకాన్ని బట్టి మొక్క నాటేందుకు గుంతలు తీసేందుకు, మొక్కనాటడం, ఎరువులు వేసేందుకు, నీటిని అందించి మొక్కలను సంరక్షించేందుకు 3 ఏళ్ల వరకు మెయింటెనెన్స్ కూడా చెల్లించనున్నట్లు చెప్పారు. నీటి వసతి ఉన్న, వర్షాధార రైతులు కూడా పథకానికి అర్హులన్నారు. పండ్లతోటల సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. జాబ్‌కార్డు కలిగి 5 ఎకరాలలోపు భూమి ఉన్న ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వర్లు, జేఈ జిలానీ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నం పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత



సంగాలలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఈజీపీఆర్డీ బాలన్న

చిప్పగిరి: పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని ఈజీపీఆర్డీ బాలన్న అన్నారు. సోమవారం మండలంలోని నేమకల్లు, సంగాల గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇంకుడు గుంతలు తీసుకోవాలని సూచించారు. వ్యర్థ పదార్థాలను తడి, పొడి చెత్తగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అనంతరం డ్రైనేజీలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సువర్ణమ్మ పాల్గొన్నారు.